త్రిశక్తి పీఠ యాత్రకు ప్రత్యేక రైళ్లు

- త్రివెల్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్ గౌరవ్ పతకం కింద మహాలయ అమావాస్యకు త్రిశక్తి పీఠ యాత్రలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు త్రివెల్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక రైల్ ప్రయాగ, వారణాసి, గయ, అయోధ్య, హరిద్వార్, ఢిల్లీ, మధుర, అగర్తలా తదితర ప్రదేశాల సందర్శనకు అనువుగా ప్రయాణిస్తున్నదన్నారు. వచ్చే నెల పదిన రైల్ బయలుదేరనుందని తెలిపారు. ఈ ఉలా రైలులో దారి పొడవునా యాత్రా విశేషాలను వివరించేందుకు పిఎ సిస్టమ్, సిసిటివి కెమెరాలు, కోచ్ సెక్యూరిటీ, టూర్‌మేనేజర్లు, ట్రావెల్ ఇన్సూరెన్స్ తదితర సదుపాయాలు ఉంటాయని తెలిపారు. స్లీపర్ (బడ్జెట్) రూ. 22,300, స్లీపర్ (ఎకానమి) రూ.26,800, థర్డ్‌ఎసి (స్టాండర్డ్) రూ.36,950 ధరల్లో ఉంటుందని తెలిపారు. వివరాల కోసం7876101010, ఆన్‌లైన్‌బుకింగ్ కోసం www.railtourism.com సంప్రదించాలని కోరారు.

ఉత్తమ పర్యాటక గ్రామంగా చందలపూర్

- కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఎంపిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తమ పర్యాటక గ్రామంగా సిద్ధిపేట జిల్లా చందలపూర్ గ్రామాన్ని కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఎంపికను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ తెలిపింది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాల్లో సాధించిన విజయాలను పరిగణనలోకి తీసుకుని 4,500 జనాభా కలిగిన ఈ గ్రామాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. గొల్లభామ చీరలతో సహా ప్రత్యేకమైన చేనేత రకాలకు, సంప్రదాయ చేనేత కార్యకలాపాలకు ఈ గ్రామం ప్రసిద్ధి చెందింది. గ్రామం రంగనాయక స్వామి ఆలయ పరిధిలో ఉండం, కోమటి చెరువు సరస్సు, వర్గల్ సరస్వతి దేవాలయం చేరియాల నకాషి పెయింటింగ్ క్లస్టర్‌తో ప్రత్యేకతను సంతరించుకున్నది. రంగనాయక సాగర్ రిజర్వాయర్ చందలపూర్ గ్రామానికి మరో మణిహారంగా మారిందని చెప్పొచ్చు. గ్రామస్తులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగిస్తూ గ్రామ వసులకు గుడ్డ సంచులు, జనపనార సంచులను అందించారు. సోలార్ లైట్లను వినియోగిస్తున్నారు. చందలపూర్‌తో పాటు జనగాం జిల్లాలోని పెంబర్తి గ్రామం ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైంది.

ఎమ్మెల్యే గొంగిడి సునీతకు హైకోర్టు జరిమానా

- కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతకు హైకోర్టు జరిమానా విధించింది. 2018 ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులను చూపకుండా, తప్పుడు సమాచారాన్ని ఇచ్చారని ఆలేరుకు చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డి హైకోర్టులో పిటీషన్ వేశారు. ఆ కేసులో కౌంటర్ పిటీషన్ దాఖలు చేయకపోవడంతో ఎమ్మెల్యే సునీతపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెకు రూ.10వేల జరిమానా విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 3వ తేదీలోగా కౌంటర్ దాఖలు చేయకుంటే.. ఆ తర్వాత దాఖలు చేసేందుకు అవకాశం లేదని హైకోర్టు పేర్కొంది.

గణేశ్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

- రాచకొండ సిపి డిఎస్ చౌహాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రశాంత వాతావరణంలో ఈ నెల 28న గణేశ్ నిమజ్జనం పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహాన్ తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో జిహెచ్ఎంసి, మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీ మూడు రకాల కలయిక ఉంటుందన్నారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా పెద్దఎత్తున ప్రజలు, నిర్వాహకులు తరలివచ్చే అవకాశముందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని చెప్పారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో మీడియా సమావేశంలో సిపి వివరాలు వెల్లడించారు. గణేష్ ఉత్సవాల కోసం నెల రోజుల ముందు నుంచే సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. నిర్వాహకులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు, ఇతర శాఖలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. రాచకొండ పరిధిలో దాదాపు 4 వేల సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలతోపాటు మండపాల సమీపంలో దాదాపు 228 పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరు వేల మంది పోలీస్ సిబ్బందితో భద్రత కట్టుదిట్టం చేశామని, అదనంగా మరో వెయ్యి మంది ఫోర్సును అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. రాచకొండ పరిధిలో 56 చెరువులు, కుంటలుండగా, అందులో కాప్రా, సఫిల్‌గూడా, సరూర్‌నగర్, ఉప్పల్ తదితర 11 ప్రాంతాల్లో పెద్ద చెరువులున్నాయని తెలిపారు. పలు ప్రాంతాలల్లో ట్రాఫిక్ మళ్లింపులు, ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోవుంటాయని, సాధారణ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. నిమజ్జనాన్ని వీక్షించేందుకు పలు ప్రాంతాల్లో పెద్దపెద్ద డిస్‌ప్లేలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. నిమజ్జన ఘాట్ల వరకు ఇతర వాహనాలకు అనుమతిలేదన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం

- ప్రభుత్వం నిర్బంధాన్ని తక్షణమే ఆపాలి
- చర్చలు జరిపి సమ్మె విరమణకు పూనుకోవాలి
- కేంద్ర కార్మిక సంఘాల నేతల డిమాండ్
- హైదరాబాద్‌లో ధర్నాకు భారీగా తరలొచ్చిన అంగన్‌వాడీ ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ జెఎసితో చర్చలు జరిపి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు మద్దతుగా అవసరమైతే కార్మిక సంఘాలే నేరుగా సమ్మెకు దిగుతాయని ప్రకటించారు. అంగన్‌వాడీ ఉద్యోగులపైనా, సమ్మెపైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు పెద్దఎత్తున తరలొచ్చారు. 'కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి, జెఎసితో చర్చించి సమ్మెను పరిష్కరించాలి, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలి, అంగన్‌వాడీలపై పోలీసుల నిర్బంధాన్ని ఎత్తేయాలి, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి' అని పెద్దఎత్తున నినాదాలు చేయడంతోపాటు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు, ఏఐటీయూసీ నాయకులు పావని అధ్యక్షవర్గం సమావేశాన్ని నిర్వహించారు.

మాతో పెట్టుకుంటే చరిత్ర పునరావృతం : పాలడుగు భాస్కర్

అంగన్‌వాడీల శక్తి గురించి మాజీ సిఎం చంద్రబాబును అడిగి తెలుసుకోవాలని సిఎం కెసిఆర్‌కు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సూచించారు. తమతో పెట్టుకుంటే చరిత్ర పునరావృతమవుతుందని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించకపోతే అంగన్‌వాడీ ఉద్యోగులు, వారి కుటుంబాలు హైదరాబాద్‌ను దిగ్బంధిస్తారని చెప్పారు. ఇప్పటికైనా చర్చలు జరపాలనీ, మంత్రి, అధికారులను

ధర్నాలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

పంపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను జఠిలం చేయొద్దని సూచించారు. 16 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు ఒంటరిగా లేరనీ, రాష్ట్రంలోని కోటి మంది కార్మికులు, కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల అండ ఉందన్నారు. అంగన్‌వాడీలు అర్ధాకలితో ఉన్నారనీ, వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలిస్తూ సమ్మెకు వెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చేశాయని విమర్శించారు. సమ్మె చేయడం రాజ్యాంగ హక్కని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా పట్టుదలకు పోకుండా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్ఎల్ పద్మ, ఐఎన్‌టియుసి జాతీయ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉమానాగేంద్రమణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం విజయ్‌కుమార్ యాదవ్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోస్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని చెప్పారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని విమర్శించారు. తాళాలు పగలగొట్టి సమ్మెను విచ్ఛిన్న చేయాలని చూస్తున్నదనీ, బెదిరింపులకు పాల్పడుతున్నదని చెప్పారు. సమ్మెలో ఉన్న సంఘాలను చర్చలకు పిలవకుండా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. చిన్న పిల్లలు, బాలింతలపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రేమ ఉంటే సమ్మెలో ఉన్న సంఘాలతో చర్చలు జరిపి సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం : జయలక్ష్మి

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామనీ, ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్), హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి హెచ్చరించారు. తాత్సారం చేస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే బిఆర్ఎస్‌కు పడుతుందని హెచ్చరించారు. చర్చలకు పిలిచి నిర్దిష్టమైన హామీలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే ఎమ్మెల్యేలు, మంత్రులను పనిచేయనివ్వబోమనీ, దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (ఎటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ కరుణకుమారి మాట్లాడుతూ 16 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ వైఖరి మార్చుకోవాలనీ, వెంటనే చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

29న 'ఎన్నికల' క్యాబినెట్

- ఆఖరిసారిగా భేటీకానున్న మంత్రివర్గం
- మరోసారి ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్ల సిఫారసు
- కొత్త పింఛన్లు.. రైతు బంధు పెంపుపై చర్చించనున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్టోబరు మొదటి వారంలో శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ రానుందనే వార్తల నేపథ్యంలో అధికార బిఆర్ఎస్ అందుకనుగుణంగా వేగం పెంచుతోంది. ఎలక్షన్ తాయిలాల్లో భాగంగా సిఎం కెసిఆర్ ఓటర్లకు మరిన్ని హామీలివ్వనున్నారు. ఈ హామీలు, తాయిలాలపై చర్చించేందుకు ఈ నెల 29న రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా భేటీ కానుంది. ప్రస్తుత సర్కారుకు దాదాపు ఇదే ఆఖరి క్యాబినెట్ కానుంది. నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీలుగా గతంలో మంత్రివర్గం సిఫారసు చేసిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి క్యాబినెట్ వారి పేర్లను ఆమోదించి, గవర్నర్‌కు తిరిగి సిఫారసు చేయనుందని సమాచారం. ప్రతిపక్ష కాంగ్రెస్ ఇటీవల ఆరు గ్యారెంటీలను ప్రకటించడంతో గులాబీ పార్టీ ఉక్కిరిబిక్కిరైంది. వాటికి ధీటుగా బిఆర్ఎస్ మ్యానిఫెస్టోను రూపొందించాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. ఆసరా పింఛన్ల పెంపు, రైతు బంధు కింద ఇచ్చే ఆర్థిక సాయం పెంపు తదితర అంశాలను ఎన్నికల ప్రణాళికలో ఆయన చేర్చనున్నారు. వీటితోపాటు ఉద్యోగుల డిఎ పెంపు, వారికి సంబంధించిన ఇతర ప్రధానాంశాలు ఎన్నికల ప్రణాళికలో ఉండబోతున్నాయి. నిరుద్యోగుల కోసం ఏదైనా ఒక పథకాన్ని ప్రవేశపెట్టే అవకాశముంది. దళిత బంధు, బిసి, మైనారిటీ బంధు పథకాలు తమకు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తాయని భావిస్తున్న సిఎం కెసిఆర్... వాటి తరహాలోనే మహిళా బంధు పథకానికి రూపకల్పన చేయబోతున్నారని అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీటన్నింటిపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. ఈ రీత్యా 29న నిర్వహించబోయే క్యాబినెట్ భేటీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

చిట్యాల ఐలమ్మ తెలంగాణ ఆస్తి

- బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి -కల్చరల్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో పేద బడుగు బలహీనర్గాల హక్కుల కోసం పోరాడిన యోధురాలు చిట్యాల ఐలమ్మ.. తెలంగాణ ఆస్తి అని బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో ఐలమ్మ వంటి వారి త్యాగాలను విస్మరించారని, తెలంగాణ రాష్ట్రంలో అధికారికంగా జయంతిని జరుపుకుంటూ వారి త్యాగాన్ని గుర్తు చేసుకుంటున్నామన్నారు. ఐలమ్మ 128వ జయంతిని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రధాన వేదికపై తెలంగాణ ప్రభుత్వ నిర్వహణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 56 ప్రాంతాల్లో ఐలమ్మ విగ్రహాలను ప్రతిష్టించి ఆమె పోరాట చరిత్రను ముందు తరాలకు అందిస్తున్నామని తెలిపారు. ఆత్మగౌరవంతో జీవించేలా చాకలి వృత్తి చేసుకునే వారికి ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. ఉప్పల్ భగాయత్‌లో చాకలి ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బిసి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళ భరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. విద్యతోనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ ఛైర్మన్ అక్కిరాజు శ్రీనివాస్, గోపి రజక తదితరులు పాల్గొన్నారు.

పని అడ్డాల్లో సౌకర్యాలు కల్పించాలి

- భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర సదస్సు డిమాండ్
- 11 మందితో కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న మహిళలకు పని ప్రదేశాలు, అడ్డాల్లో మరుగుదొడ్లు, మంచినీరు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ విమర్శించారు. పనిచేసే చోట లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం సైతం వర్తించడం లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికుల రాష్ట్ర సదస్సు శ్రామిక మహిళ ఎస్.రేణుక అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు, పెన్షన్, ధరల పెరుగుదల తదితర సమస్యలను కూడా శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. వెల్ఫేర్ బోర్డులో వేల కోట్ల నిధులు మూలుగుతున్నా, కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయకుండా రూ.250 కోట్లను బిసి బంధుకు అక్రమంగా మళ్ళించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు లక్ష మోటార్ సైకిళ్ళు ఇస్తామంటూ 2022లో అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం ప్రకటించి రెండేండ్లు దాటుతున్నా అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్మిక శాఖామంత్రి ప్రకటించిన మోటార్ సైకిళ్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివాహ కానుక, ప్రసూతి సహాయాన్ని రూ.లక్షకు పెంచాలని సూచించారు. మహిళా కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో సంఘం గౌరవాధ్యక్షులు వంగూరు రాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల-1996 కేంద్ర చట్ట ప్రకారం కార్మికులకు గృహ వసతి, వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, 60 ఏండ్లు పైబడిన వారికి రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. కోటంరాజు, అధ్యక్షులు ఎస్. రామ్మోహన్, ఉపాధ్యక్షులు వి. నర్సింహారావు, రాజు, డిఎల్ మోహన్, సోమయ్య, కోశాధికారి ఎల్క సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్‌గా రేణుక

భవన నిర్మాణ మహిళా కన్వీనింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఎస్. రేణుకను రాష్ట్ర సదస్సు ఎన్నుకుంది.అలాగే మరో 11 మందితో కమిటీ ఏర్పాటైంది.

చౌమాన్ 32వ అవుట్‌లెట్ ప్రారంభం

హైదరాబాద్: చైనీస్ రుచులను అందించే చౌమాన్ హైదరాబాద్‌లో తన తొలి అవుటలెట్‌ను ప్రారంభించింది. సంప్ర దాయ చైనిస్, థాయ్ వంటకాల శ్రేణిని కలిగి ఉన్న అత్యుత్తమ ఓరియంటల్ వంటకాలతో తమ సంస్థ నూతన శిఖరాలకు చేరుకుందన్నారు. కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఈ కొత్త స్టోర్‌తో దేశంలో 32వ అవుట్‌లెట్‌లకు విస్తరించినట్లయ్యిందని చౌవ్‌మాన్ హాస్పిటాలిటీ ఎండి దేబాదిత్యా చౌదరీ అన్నారు. తమ సంస్థకు కోల్‌కత్తా, బెంగళపూరు, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో అవుట్‌లెట్‌లు ఉన్నాయని.. తాజాగా హైదరా బాద్‌కు విస్తరించామన్నారు.

నేడు టెట్ ఫలితాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ నెల 15న టెట్ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,26,744 (84.12 శాతం) మంది హాజరయ్యారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,89,963 (91.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE VIZIANAGARAM
I.A.No.1047/2022 in O.S.No.97/2022

Between:
Nethula Sudharani ...Petitioner/Plaintiff
And:
Pudari Mamatha ....Respondents/Defendants
To,
1.Smt. Pudari Mamatha W/o Odulu, aged 29 years, Hindu, resident of D.No.9-3-252, Vittal Nagar, Peddapalli, Ramagundam, Karimnagar District, State of Telangana.

NOTICE

Please take notice that above matter stands posted to **17-10-2023** for appearance of the 1st Respondent/ 1st Defendant and she should appear before the above Court on that day in person or through an Advocate and if they fails to appear on that day at **10-30 A.M.**, the matter will be heard and decide exparte.
As per the orders of the Honorable Court.

V.G.SANTOSH,
Advocate,
VIZIANAGARAM.
Cell: 9885001439

రాజకీయాలకు నెలవుగా రాజ్‌భవన్ : కోలేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి దోహదపడాల్సిన గవర్నర్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని బలహీనపరిచే మెకానిజంగా మారిపోయిందని, రాజ్‌భవన్ రాజకీయాలకు నెలవుగా మారడం సరిగాదని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ ఆక్షేపించారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయాలకతీతంగా, స్వతంత్రంగా, రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సిన రాజ్‌భవన్‌లు పార్టీల వ్యక్తులకు నెలవుగా మారాయని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వ నిర్ణయాలను తోసిపుచ్చే అవకాశం గవర్నర్లకు లేదని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడం తగదని సూచించారు. రాష్ట్ర మంత్రిమండలి సిఫారసు చేసిన ఎమ్మెల్సీల అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బిజెపి అభ్యర్థులనే ఎమ్మెల్సీలుగా నియమించినప్పుడు లేని అభ్యంతరం తెలంగాణలోనే ఎందుకని ప్రశ్నించారు. రాజకీయ నేపథ్యముందన్న సాకుతో దాసోజు శ్రవణ్, సత్యనారాయణల పేర్లను తిప్పి పంపడం బాధాకరమని పేర్కొన్నారు. రాజకీయాలను అదుపు చేసే సాధనంగా గవర్నర్ వ్యవస్థ మారాడాన్ని తప్పుబట్టారు. తక్షణమే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన నిర్ణయాన్ని పున:పరిశీలించి మంత్రి మండలి నిర్ణయాన్ని గౌరవిస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థులను నామినేట్ చేయాలని కోరారు.

కెటిపిపి ఇంజనీరింగ్ అధికారుల గుండెల్లో గుబులు

- నేడో, రేపో మరికొంతమంది అధికారుల అరెస్టులు
- యంత్ర పరికరాల చోరీ ఘటనపై పోలీసుల రెడ్ మార్క్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు(కెటిపిపి)లోని యంత్ర పరికరాల చోరీ కేసులో ఇంజనీరింగ్ అధికారుల గుండెల్లో గుబులు పుడుతోంది. నేడో, రేపో మరి కొంతమంది ఇంజనీరింగ్ అధికారులను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. కెటిపిపిలోని స్టోర్ రూమ్‌లో జూన్ మొదటి వారంలో చోరీ జరిగింది. ప్రాజెక్టుకు వినియోగించే టర్బైన్ విడి భాగాలు, బాయిలర్, జనరేటర్, బేరింగ్స్, కాపర్ వాల్స్ లాంటి సుమారు రూ.82 లక్షల విలువైన పరికరాలు మాయమయ్యాయి. దీనిపై ఇంజనీరింగ్ అధికారులు జూన్ 7న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జెన్కో విజిలెన్స్ అధికారులు, డైరెక్టర్లు కెటిపిపిలో పరిశీలించారు. అనంతరం ఇద్దరు సిఐలు, ఒక డిఎస్‌పి అధికారితో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు విచారణ చేపట్టగా అవినీతి బాగోతం ఒకొక్కటి వెలుగులోకి వస్తోంది. ఈ

క్రమంలో కెటిపిపికి వెల్డింగ్, కట్టింగ్ పనులు చేసే కల్యాణి ఇంజినీరింగ్ వర్క్సుకు చెందిన కాంట్రాక్టర్ ఠాగూర్ వద్ద కొన్ని సామాన్లు లభ్యమయ్యాయి. దాంతో ఆయనను పోలీసులు గత శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఎడిఇ)కి డి.కిరణ్‌కుమార్‌నూ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల విచారణలో మరి కొంతమంది ఇంజినీరింగ్ అధికారులు ఉన్నట్టు సమాచారం. రూ.82 లక్షల దొంగతనం కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు జెన్కో అధికారులను సీరియస్‌గా విచారిస్తున్నారు.

చిత్తం దేవుడిపై.. భక్తి ఓట్లపై..!

- వినాయక మండపాల చుట్టూ నేతల ప్రదక్షిణలు
- అడగకపోయినా చందాలిస్తూ ఓటర్లకు గాలం
- అభివృద్ధి, హామీలపై పలుచోట్ల స్థానికుల నిలదీత
- ఆవేశాన్ని దిగమింగి.. ప్రశ్నించిన వారి గురించి నేతల ఆరా..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'చిత్తం దేవుడిపై.. భక్తి ఓట్లపై..' అనే రీతిలో నేతలు వినాయక మండపాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఐదేళ్లలో ఎన్నడూ లేనిది ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గణేశ్ నవరాత్రులను అడ్డుపెట్టుకున్నారు. వివిధ గ్రామాల్లో పదుల సంఖ్యలో వెలిసిన వినాయక మండపాలకు వెళ్తూ అడగకపోయినా చందాలు ఇస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే హాట్ స్థానంగా ఉన్న పాలేరు నియోజకవర్గంలో పోటాపోటీగా గణేశ్ ఉత్సవ కమిటీలకు నేతలు కానుకలు ఇస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఒక్కో మండపానికి రూ.పది వేలు, రూ.ఐదు వేల చొప్పున నేతలు ఇస్తున్నారు. ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం తదితర నియోజకవర్గాల్లో డిజెలు, కరెంట్ సప్లయ్ పర్మిషన్‌ల ఖర్చులను కొందరు నేతలు భరిస్తున్నారు. మరికొందరు అన్నదానం ఖర్చులను ఇస్తున్నారు. వినాయకుని ఖర్చుల భారం మోయలేక కొందరు నేతలు చందాల కోసం వచ్చేవారికి దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారు. గణేశ్ నవరాత్రులు ముగిసే వరకు హైదరాబాద్‌లో తలదాచుకునేవారూ ఉన్నారు.

డబ్బుల చుట్టూ రాజకీయాలు..

ఒకప్పుడు అభివృద్ధి, సిద్ధాంతాలు, పాలన తీరు ప్రాతిపదికన ఆదర్శవంతమైన రాజకీయాలు నడిచేవి. కానీ ఇప్పుడు రాజకీయాలను డబ్బు శాసిస్తుందని ప్రజాస్వామ్య వాదులు వాపోతున్నారు. పాలేరు నియోజకవర్గంలో ఒక్క గణేశ్ మండపాలకు ఓ ఇద్దరు నేతలు

సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారంటే ఎన్నికలు ఎంత క్లాస్టిలీ అయ్యాయో అర్థం చేసుకోవచ్చంటున్నారు. ఖమ్మం రూరల్ 400, తిరుమలాయపాలెం 270, నేలకొండపల్లి 207, కూసుమంచి 180 వరకు గణేశ్ మండపాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1100 విగ్రహాలను ఏర్పాటు చేస్తే ఒక్కో దానికి ఓ నాయకుడు రూ.పది వేల చొప్పున ఇస్తే.. మరో నాయకుడు రూ.5వేల చొప్పున మండపం మండపానికి వెళ్లి చందాలు ఇచ్చారు. డబ్బులు అంతగా లేని ఆశావహులు, అభ్యర్థులకు గణేశ్ నవరాత్రులు ఓ పెద్ద సవాల్‌గానే మారాయి. వెయ్యి ఓట్లు ఉన్న ఊరులో పది వరకు మండపాలు నెలకొల్పారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అభివృద్ధి, హామీలపై నిలదీత..

కొన్ని చోట్ల గణేశ్ మండపాల వద్దకు వెళ్లిన అధికార పార్టీ అభ్యర్థులకు చేదు అనుభవం ఎదురవుతోంది. స్థానిక సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వానలు, వరదలు, పంటనష్టాల సమయంలో రాలేదు కానీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పుడు వచ్చారంటూ.. నేతలను నిలదీస్తున్నారు. రోడ్లు, డ్రయినేజీలు లాంటి కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితుల్లో అనేక కాలనీలు ఉన్నాయి. సంక్షేమం విషయంలో వివక్షత చోటుచేసుకోవడంపైనా అడుగుతున్నారు. ఇలాంటి వారి విషయంలో నేతల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నా.. ఎన్నికల నేపథ్యంలో మారుమాట్లాడకుండా వెళ్తున్న ఉదంతాలూ ఉన్నాయి. అయితే ఎక్కడ ఎవరు ప్రశ్నించారు? వారి రాజకీయ నేపథ్యం ఏంటి? అనే విషయాలపై ఆరా తీస్తుండటం కనిపించింది.

నాటి ఎమ్మెల్యేలు అభివృద్ధికి కట్టుబడేవారు..

- నున్నా నాగేశ్వరరావు, రైతుసంఘం రాష్ట్ర నాయకులు

నాటి నేతలు అభివృద్ధికి కట్టుబడేవారు. అప్పట్లో డబ్బులకన్నా పనితీరుకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఓటు విలువ ఆర్థికంగా గణనీయంగా పెరిగింది. ఎన్నికల సమయంలో ఇచ్చే ఇలాంటి తాయిలాలను ఆశిస్తే గెలిచినాక ఆమేరకు కూడబెట్టుకునే పనిలో నేతలు ఉంటారనే విషయాన్ని ప్రజలు గ్రహించాలి.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT KAKINADA EAST GODAVARI DISTRICT
A.A.C.F. No.53 /2022

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Amalapuram Branch, Rep. By it's Foreman, ...Disputant
And
Ithabathula Chandravathi **& Others** ...Opponents

Notice to Opponents 2 & 3
2. Peyyala Praveeen Kumar, S/O Baburao, Hindu, Aged 38 Years, Employee, General Mazdoor, Srp-Rk-6, Incline, The Singareni Collieries Company Ltd, Srirampur Area, Mancherial Dist, R/O D.No.8-3-47, Mallikarjuna Nagar, Godavarikhani, Karimnagar Dist. **(Opponent 2)**
3. Sudula Srinivas, S/O Papaiah, Hindu, Aged 54 Years, Employee, Stores Issue Mazdoor, The Singareni Collieries Company Ltd, Ramagundam-1 Area, Karimnagar Dist, R/O D.No.15-4-214, Jawahar Nagar, Godavari khani, Ramagundam, Karimnagar Dist. **(Opponent-3)**

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to all of you and posted the case to 05-10-2023 for your appearance. So all of you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Kakinada, Court Compound, Kakinada on 05-10-2023 at 10-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.
(By order of the Honourable Deputy Registrar)

Hearing Date: 05-10-2023
MD. M.CHISTI.,
Advocate
KAKINADA

బంధన్ ఎంఎఫ్ నుంచి రిటైర్మెంట్ ఫండ్

హైదరాబాద్ : పదవీ విరమణ అనంతరం వ్యయాల లక్ష్యాలను చేరుకోవడంలో సహాయపడటానికి బంధన్ రిటైర్మెంట్ ఫండ్‌ను ప్రారంభించినట్లు బంధన్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఈ కొత్త ఫండ్ 2023 సెప్టెంబర్ 28న తెరవబడి.. అక్టోబర్ 12న ముగుస్తుందని ఆ సంస్థ సిఇఒ విశాల్ కపూర్ తెలిపారు. "అధిక ఆయుర్దాయం, పెరుగుతున్న జీవన వ్యయం, ఆరోగ్య సంరక్షణ, ద్రవ్యోల్బణం పెట్టుబడిదారుల పొదుపులను తగ్గించగలవు. పదవీ విరమణ తర్వాత అదే జీవన ప్రమాణాన్ని కొనసాగించడం తప్పనిసరి. వీటిని అధిగమించడానికి రిటైర్మెంట్ ఫండ్‌ను ఆవిష్కరించాం. పదవీ విరమణ తర్వాత ఓ పద్దతిలో నగదు ఉపసంహరణకు ఇది వీలు కల్పిస్తుంది." అని విశాల్ పేర్కొన్నారు.

సిటీ గ్రూప్ ఉద్యోగులకు తొలగింపు భయం

న్యూయార్క్ : ప్రముఖ గ్లోబల్ విత్త సంస్థ సిటీ గ్రూప్ ఉద్యోగుల్లో భయాలు మొదలయ్యాయి. సంస్థ చేపట్టిన ప్రక్షాళనకు అనుగుణంగా వ్యవహరించాలని లేదంటే సంస్థను వీడాల్సి వస్తుందని హెచ్చరించడమే ఇందుకు కారణం. ఈ విషయమై 2,40,000 మంది బ్యాంక్ ఉద్యోగులను సిటీగ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జేన్ ఫ్రెజర్ హెచ్చరించారు. 15 ఏళ్ల తర్వాత అతిపెద్ద సంస్థ పునర్వ్యవస్థీకరణను చేపడుతున్నట్లు ఫ్రెజర్ తెలిపారు. బ్యాంక్ కోసం ఉద్యోగులు అత్యున్నత ఆశయాలతో ముందుకెళ్లాలని.. వేగవంతమైన ప్రయాణంలో త్వరితగతిన తమతో పయనించాలని ఆమె కోరారు.

ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బితో ఎస్ఎంసి గ్లోబల్ జట్టు

న్యూఢిల్లీ : ఎస్ఎంసి గ్లోబల్ సెక్యూరిటీస్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. దీంతో తమ వినియోగదారులకు 3-ఇన్-1 ఖాతాలు అందించనున్నామన్నారు. తమ బ్యాంక్ వినియోగదారులకు ఆన్‌లైన్‌లో సేవింగ్స్, డీమ్యాట్, ట్రేడింగ్ సేవలు అందించనున్నామని పేర్కొంది. ప్రస్తుతం తమ బ్యాంక్‌కు 76 లక్షల మంది పైగా వినియోగదారులున్నారని వెల్లడించింది.

కిర్లోస్కర్ నుంచి కొత్త జెన్‌సెట్‌లు

పూణె : విద్యుత్ ఉపకరణాల సంస్థ కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్ (కెఒఇఎల్) కొత్తగా సిపిసిబి4 ప్రమాణాలతో కూడిన జెన్‌సెట్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. వీటితో స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ నిర్వహణ నిబద్ధతను ప్రదర్శిస్తాయని పేర్కొంది. ఇవి డీజిల్, సహజ వాయువు, బయోగ్యాస్ తదితర బహుళ ఇంధనాలతో పని చేసేలా రూపొందించబడ్డాయని ఆ సంస్థ ఎండి గౌరీ కిర్లోస్కర్ పేర్కొన్నారు. ఇవి ఐఓటి ఆధారంగా పని చేస్తాయన్నారు.

నగరంలో డుప్లికేట్ జాన్సన్ లిఫ్టులు

హైదరాబాద్ : రాష్ట్రంలో కొద్ది మంది వ్యాపారులు తమ పేరును మోసపూరితంగా వాడుకుంటున్నారని, వినియోగదారులకు డుప్లికేట్ లిఫ్టులను అంటగడుతున్నారని జాన్సన్ లిఫ్ట్ ప్రయివేటు లిమిటెడ్ పేర్కొంది. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇటీవల జాన్సన్ లిఫ్ట్ లోగోతో డుప్లికేట్ లిఫ్టులను తయారు చేసి వినియోగదారులను తప్పుదారి పట్టించిన వారిపై కేసు పెట్టామని ఆ సంస్థ ప్రతినిధి చైతన్య పోతినేని పేర్కొన్నారు. అనాధికార తయారీదారులను చట్టపరంగా ఎదుర్కోనున్నామన్నారు.

దసరా నుంచి ముఖ్యమంత్రి అల్పాహార పథకం

- మెనూను త్వరితగతిన రూపొందించండి
- అమలుకు ఏర్పాట్లు పూర్తి చేయండి
- అవసరమైన వంటపాత్రలను సమకూర్చండి
- అధికారులకు మంత్రి సబిత ఆదేశం

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా అల్పాహారాన్ని అందించేందుకు ఉద్దేశించిన 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తన కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన, విద్యాశాఖ అధికారులు, అక్షయపాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు దసరా పండుగ రోజు నుంచి "ముఖ్యమంత్రి అల్పాహార పథకం" ప్రారంభించనున్నట్టు మంత్రి తెలిపారు. ఇందుకు సంబందించిన మెనూను త్వరితగతిన నిర్ణయించి అందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ పథకానికి సంబంధించి విధి, విధానాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. దేశంలోనే పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్న రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలిచిపోనుందని మంత్రి పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి చదువు పట్ల ఏకాగ్రతను పెంచే దిశగా చేపట్టిన ఈ పథకంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ పథకం అమలును జిల్లా స్థాయిలో పర్యవేక్షించే బాధ్యతను అదనపు కలెక్టర్లకు అప్పగించనున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యతోపాటు మంచి పోషకాహారం అందించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం విజయవంతం అయ్యేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి అవసరమైన వంట పాత్రలను సమకూర్చే ఏర్పాట్లు ప్రారంభించాలని తెలిపారు. ఈ పథకం అమలుచేయడం ద్వారా 27,147 పాఠశాలల్లోని దాదాపు 23 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుందని వివరించారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యాన్ని, విద్యార్థులకు గుడ్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతున్నా తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోండి

- ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక వైద్య బృందాలను పంపండి
- తీవ్రత ఎక్కువున్న జిల్లాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి
- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్స్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. వాటి తీవ్రత ఎక్కువున్న జిల్లాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక వైద్య బృందాలను వెంటనే పంపాలని సూచించారు. సంచార వైద్యశాలలు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనీ, అవసరమైన టెస్టులను ఉచితంగా చేయించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వెంటనే దోమ తెరలను అందించాలని కోరారు. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ముఖ్య మంత్రి కె చంద్రశేఖర్‌రావుకు ఆయన లేఖ రాశారు. 'ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు వేగంగా ప్రబలుతున్నాయి. డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, అతిసార వంటి వాటికి గురై ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆదిలాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, భూపాలపల్లి వంటి జిల్లాల్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ములుగు జిల్లాలో ఏటూరు నాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో ఊర్లకు ఊర్లే జ్వరాలు, వ్యాధులతో మగ్గుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో కోటపల్లి, జన్నారం, బెల్లం పల్లి, మంచిర్యాల మండలాల్లో మా పార్టీ ప్రతినిధుల బృందాలు బాధిత ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు స్థానిక ఆర్ఎంపిలను ఆశ్రయి స్తున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం. మెడికల్ టెస్టులు చేయించుకోవాలంటే సుదూరంగా ఉన్న వరంగల్ ఎంజిఎం, తదితర ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జ్వర తీవ్రత ఎక్కువై ఆస్పత్రికి చేరేలోపే కొందరు చనిపోతున్నారు. స్థానిక పిహెచ్‌సిలు, ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి వల్ల వైద్యం సరిగ్గా అందని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు ఆస్పత్రుల వైపు వెళ్లాల్సి వస్తోంది. జ్వర బాధితులు వైద్యం కోసం రూ.5 వేల నుంచి రూ.20 వేల దాకా అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి' అని లేఖలో తమ్మినేని పేర్కొన్నారు.

5న జిపి కార్మికుల చలో హైదరాబాద్ : జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్టోబర్ ఐదో తేదీన గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎండి యూసుఫ్, కన్వీనర్లు వెంకటరాజం, చాగంటి వెంకటయ్య, పి అరుణ్‌కుమార్, శివబాబు, ఎన్ దాసు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జెఎసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొలుత అక్టోబర్ ఒకటో తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టినప్పటికీ మిలాద్-వున్-నబీ ర్యాలీ సందర్భంగా ఆంక్షల నేపథ్యంలో పోలీసులు తమ కార్యక్రమానికి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. దీంతో అనివార్యంగా కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. అదే కార్యక్రమం ఐదో తేదీన ఉంటుందని ప్రకటించారు. చలో హైదరాబాద్ సందర్భంగానే సమ్మె తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

కారు దిగేందుకు సిద్ధమైన కసిరెడ్డి!

- కెటిఆర్ బుజ్జగించే ప్రయత్నం
- కార్యకర్తల ఒత్తిడి ఉందన్న ఎమ్మెల్సీ
- 29న కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు?

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నాయాయణరెడ్డి కారు దిగి చెయ్యి అందుకునేందుకు సిద్ధమైనట్టు ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వైఖరితోపాటు, పార్టీలో కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయంపై అధిష్టానానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్ల విసిగిపోయిన ఆయన చివరకు బిఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఆయన పార్టీ మారుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రగతిభవన్ వర్గాలు స్పందించాయి. స్వయంగా కసిరెడ్డి నారాయణరెడ్డికి మంత్రి కెటిఆర్ ఫోన్ చేసి పిలిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో చర్చలు జరిపారు. "మూడు రోజుల సమయం ఇవ్వండి.. అభ్యర్థి మార్పు విషయంలో నాన్న (సిఎం కెసిఆర్)తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం.. పార్టీ మారొద్దు.. మీకు భవిష్యత్తు ఉంటుంది" అని నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. తనపై కార్యకర్తల ఒత్తిడి తీవ్రంగా ఉందని, గతంలో పార్టీ టికెట్ ఇస్తామన్న హామీ విషయాన్ని ఈ సందర్భంగా కసిరెడ్డి గుర్తుచేసినట్టు సమాచారం. ఐదు సంవత్సరాలుగా ఎంతో ఓపికతో ఉన్నానని, తన మద్దతుదారులకు, కార్యకర్తలకు పార్టీలో ఎమ్మెల్యే తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు దళిత బంధు, గృహలక్ష్మి, బీసీ బందు తదితర పథకాలలో ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తులకే అందజేస్తున్నారని అలాంటప్పుడు తాను పార్టీలో ఉండి ఏమి ఉపయోగం లేదని మంత్రితో అన్నట్టు సమాచారం. కార్యకర్తల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్టు వినిపిస్తోంది. ఎమ్మెల్సీ మాత్రం తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైనట్టు ప్రచారం సాగుతోంది.

ఈ నెల 29న కాంగ్రెస్‌లోకి..

బిఆర్ఎస్ పార్టీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇప్పటికే పార్టీ అధినేత రాహుల్ గాంధీతో చర్చించిన ఆయన ఈ నెల 29న కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. రాబోయే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

దీంతో ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డికి స్వాగతం పలుకుతున్నారు. ఆయన పార్టీలోకి వస్తే కల్వకుర్తి గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమన్న ధీమాతో ఉన్నారు.

బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే నాయకుల వలస కొనసాగుతూనే ఉన్నది. తాజాగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు హస్తం గూటికి చేరారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి నివాసంలో వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వైస్ ఎంపిపి నిర్మల, ఎంపిటిసిలు కృష్ణయ్య, శ్రీను, రాజు, మల్లయ్య, మాజీ ఎంపిటిసిలు రమణారావు, శాంతయ్య, సర్పంచ్ స్వామి, ఉప సర్పంచ్ భగవంత్‌గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్లు రామచంద్ర రావు, తిరుపతయ్య, మాజీ సర్పంచులు నర్సింహా, బుచ్చన్న, కుర్మయ్య, కౌన్సిలర్ శ్రీనివాసులు తదితరులున్నారు.

త్వరలో వజీర్ ప్రకాష్ గౌడ్ చేరిక

బిఆర్ఎస్ నేత, జిహెచ్ఎంసి మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వజీర్ ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. తాజాగా ఆయన రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మానిక్‌రావ్ ఠాక్రే, మధుయాష్కీగౌడ్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

కూలీలపై పిడుగు పాటు

- గుండాలలో ఒకరు దుర్మరణం
- తిరుమలాయపాలెంలో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోజువారి వ్యవసాయ కూలీ పనులకు వెళ్తే గాని పూట గడవని నిరుపేద కూలీలు పిడుగుపాటుకు గురి కావటంతో ఒకరు దుర్మరణం చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కొడవటంచ గ్రామానికి చెందిన రైతు గొగ్గెల రామస్వామి మంగళవారం తన పశువులను మేపుకొని ఇంటికి వస్తున్న క్రమంలో అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. అదే సమయంలో రైతు సమీపంలో పిడుగు పడటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన రైతు మద్ది వీరయ్య వ్యవసాయ భూమిలో మిర్చి పంటలో కలుపు తీసేందుకు మంగళవారం అదే గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవటంతో ఒక్కసారిగా కూలీలంతా దగ్గరలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో కూలీలంతా సొమ్మసిల్లిపోయారు. దగ్గర్లో ఉన్న రైతులు వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మద్ది వరమ్మ, గోకనపల్లి సావిత్రి ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. పిడుగుపాటుకు గురైన కూలీలకు ప్రకృతి విపత్తు కింద ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని రైతు సంఘం నాయకులు తుళ్లూరు నాగేశ్వరావు, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శీను ప్రభుత్వాన్ని కోరారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కాంట్రాక్ట్ అధ్యాపకుల్ని రెగ్యులరైజ్ చేయాలి

- కాంట్రాక్ట్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్టు అధ్యాపకుల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం హన్మకొండ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. యూనివర్సిటీ పరిపాలన భవనం నుంచి ఎస్‌డిఎస్‌సి క్రాస్ రోడ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి చైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్ పాల్గొని మాట్లాడారు. 145 రోజుల నుంచి అనేక విధాలుగా సదస్సులు, రౌండ్ టేబుల్, కాన్ఫరెన్స్, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేయడంతో పాటు యూనివర్సిటీ, ప్రభుత్వ అధికారులను, విద్యాశాఖ మంత్రి, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్‌ను కలిసినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కాంట్రాక్టు అధ్యాపకులందరూ విధుల్ని బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసినట్టు యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులనూ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మధుకర్ రావు, జరుపుల చందులాల్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రఘు వర్ధన్ రెడ్డి ఆర్‌డి ప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, కల్పన, శ్రీలత, స్వప్న, మంజుల, రాజశ్రీ, రాజేష్ రెడ్డి, రమేష్, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

6 నుంచి నారెడ్కో ప్రాపర్టీ షో

హైదరాబాద్ : నారెడ్కో తెలంగాణ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ అక్టోబర్ ఆరు నుండి ఎనిమిదోవ తేది వరకు ప్రాపర్టీ షోనూ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. తమ ఈ 13వ ఎడిషన్ ప్రాపర్టీ షోను హైదరాబాద్‌లోని హైటెక్స్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్నామని నారెడ్కో తెలంగాణ ప్రెసిడెంట్ బి సునీల్ చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. వివిధ కస్టమర్‌ల అవసరాలను తీర్చడానికి వీలుగా నివాస, కార్యాలయ, వాణిజ్య, రిటైల్ తదితర ప్రాపర్టీలను ప్రదర్శించనున్నామన్నారు. డెవలపర్లు, బిల్డర్లు, ప్రమోటర్లు భాగస్వామ్యం అవుతున్నారన్నారు. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందుతున్న వాటిలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒకటని అన్నారు. విస్తృతమైన ప్రాపర్టీలను ఎంచుకోవడానికి ఇదొక సదావకాశమన్నారు.

జిఎన్ఎం ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగింపు

- డిఎంఇ డాక్టర్ కె రమేశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఎన్ఎం నర్సింగ్ విద్యను అభ్యసించేందుకు అర్హులైన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె రమేశ్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికిగానూ ఈ నెల 30 వరకు ఆన్‌లైన్ చెల్లింపు, రిజిస్ట్రేషన్, అప్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశానికైతే డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను అక్టోబర్ మూడో తేదీలోపు సమర్పించాల్సి ఉంటుంది. ఆయా కళాశాలల ప్రిన్సిపళ్లు, ఆ దరఖాస్తులను ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అక్టోబర్ 5లోపు అందజేయాల్సి ఉంటుంది. ఏడులోపు ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తారు. ప్రయివేటు నర్సింగ్ కళాశాలల్లో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా విషయంలో డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను ఐదులోపు ఆయా జిల్లాల వైద్యాధికారులకు సమర్పించాలి. పది లోపు ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి 13 తేదీలోపు డిఎంఇ కార్యాలయానికి ఎంపిక జాబితాను సమర్పించాల్సి ఉంటుంది.

సమ్మెలో పాల్గొన్న ఆశా వర్కర్లు

నికర వేతనమివ్వండి

- ఆశా వర్కర్ల డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె
- సికింద్రాబాద్‌లోని డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యల పరిష్కారం.. ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం ధర్నా చేశారు. సికింద్రాబాద్‌లోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్, సౌత్ కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సౌత్ కమిటీ అధ్యక్షులు ఎం.మీనా మాట్లాడుతూ.. ఆశాలకు జాబ్ చార్ట్ ప్రకటించాలని, పారితోషికం లేని పనులు చెప్పొద్దని డిమాండ్ చేశారు. ఆరు నెలల పిఆర్‌సి బకాయిలు, కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 18 నెలల కరోనా రిస్క్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కారించాలని, లేనియెడల సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఆర్.మల్లేష్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు భాగ్యలక్ష్మి, సాధన, రీటా, రాధిక,సఫియా, సంగీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. మల్కాజిగిరి చౌరస్తాలోనూ ధర్నా చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆశావర్కర్లు ఏరియాస్పత్రి ఎదుట సమ్మె చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రెండో రోజు ఆశావర్కర్ల సమ్మె కొనసాగింది. పరిగిలో సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఆమనగల్‌లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కిషన్ మద్దతు తెలిపారు. చేవెళ్లలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మద్దతు తెలిపారు. యాచారంలో సమ్మెలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తూరులో సమ్మెకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా మద్దతు తెలిపారు.

బిజెపి, బిఆర్ఎస్‌లను గద్దె దించాలి

- అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా పని చేయాలి : ఆకునూరి మురళి
- టిజెఎస్‌కు పలు అంశాలపై నోట్ అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దె దించాలని సోషల్ డెమోక్రటిక్ ఫోరం (ఎస్‌డిఎఫ్) వ్యవస్థాపక కన్వీనర్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆకునూరి మురళి కోరారు. ఆయా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో చేర్చేందుకు విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యోగాల కల్పన, అవినీతిని తగ్గించడం, బిసి కులగణన అంశాలపై వాటికి నోట్స్‌ను ఎస్‌డిఎఫ్ అందజేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కాంగ్రెస్, బిఎస్‌పి పార్టీలకు వాటిని అందజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ జన సమితి (టిజెఎస్) కార్యాలయానికి వచ్చిన ఆయన ఆ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంకు నోట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ మినహా అన్ని పార్టీలకు ఆ నోట్స్ ను అందజేయనున్నట్టు తెలిపారు.

సిఎం కెసిఆర్ విద్యను విధ్వంసం చేశారని, విద్యా నాణ్యతలో దేశంలో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తెలంగాణది 35వ స్థానమని విమర్శించారు. విద్యకు చాలా రాష్ట్రాలు 14 నుంచి 15 శాతం బడ్జెట్ ఇస్తుంటే బిఆర్ఎస్ కేవలం 4.6 శాతం మాత్రమే కేటాయించిందని విమర్శించారు. వైద్యరంగ బడ్జెట్‌ను రెట్టింపు చేయాలని కోరారు. రైతులు కానీ వారికి రైతుబంధు పేరుతో రూ.28 వేల కోట్లను అందజేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నిధులను ధరల స్థిరీకరణకు కేటాయించి, రాజ్యాంగ బద్ధ వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసి అన్ని రకాల పంటలకు కనీస మద్ధతు ధర ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

డెంగ్యూ తగ్గినా.. భయపెడుతున్న ప్రయివేటు ఆస్పత్రులు

అలాంటి వారిపై చర్యలు తీసుకోండి

జిల్లా వైద్యాధికారులకు మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు డెంగ్యూ చికిత్స పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నాయి. ప్లేట్ లేట్స్ ఎక్కించాలంటూ భయపెడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఆరోగ్య శాఖ దృష్టికి వచ్చిందని ఆ శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఆరోగ్యం క్షీణించాక చివరి నిమిషంలో ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేసి బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నట్టు తెలిసిందన్నారు. వాస్తవాలు గుర్తించి, ఇలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులను మంత్రి ఆదేశించారు. మంగళవారం ఆయన సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. గతేడాది సెప్టెంబర్ వరకు డెంగ్యూ కేసులు 7,988 నమోదైతే ఈ ఏడాది ఆ సంఖ్య 5,263కు తగ్గిందని తెలిపారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి. మిషన్ భగీరథ వంటి పథకాలతో సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గాయని చెప్పారు.

వాతావరణ మార్పుల కారణంగా గత వారం, పది రోజుల్లో ఫీవర్ కేసులు స్వల్పంగా పెరిగినట్టు మంత్రి తెలిపారు. ఎవరికైనా జ్వరలక్షణాలు కనిపిస్తే ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయంచుకోవాలని, అవసరమైన మందులను అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. డెంగ్యూ, మలేరియా కేసుల్లో ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి స్వల్ప లక్షణాలున్నా చేర్చుకుని చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట జ్వరాల కోసం ప్రత్యేక ఒపి కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల సహకారంతో పంచాయతీ, మున్సిపల్ శాఖల, స్థానిక సంస్థల సమన్వయంతో దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జూమ్ ద్వారా నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.